క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు సన్మానం



లతీఫ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ లతీఫ్ తన ఆటోలో నాలుగేళ్ల నుంచి గర్భిణులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నందుకు గాను మంగళవారం ఘనంగా సన్మానించారు. గర్భిణులను ఆస్పత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం వైరా, ఖమ్మంలోని పలు ఆస్పత్రులకు ఉచితంగా తీసుకెళ్తూ ప్రజల మన్ననలు పొందుతుండగా మంగళవారం స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ భజన కమిటీ సభ్యులు సత్కరించారు. నూతి వెంకటేశ్వరరావు, సంగెపు కృష్ణ, దరిపల్లి శ్రీనివాసరావు, పొట్లపల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి పుల్లారాజు, మైజుజానీ, మోరంపూడి మోహన్‌రావు, కొనకాల, వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సురేష్

వైరా: వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరగుతున్న తప్పుడు రిజిస్ట్రేషన్ల పై అధికారులు చర్యలు తీసుకోవాలని 15వ వార్డు కౌన్సిలర్ గుడిపూడి సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని లేవనెత్తి విలేకర్లకు వివరాలు తెలియజేశారు. మున్సిపాలిటీ శివారు గ్రామం దిద్దుపూడిలో ప్రభుత్వ భూములను ఇష్టానుసారం ఎలాంటి ధృవపత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, గ్రామంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి అక్రమ రిజిస్ట్రేషన్లలో కీలకంగా వ్యవహరించాడని అధికారులు తక్షణమే స్పందించి తప్పుడు డాక్యుమెంట్లు రూపొందిస్తున్న డాక్యుమెంట్ రైటర్‌ను అరెస్టు చేసి ఆయనకు సహకరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయంతో ఆదుకోవాలి

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కారేపల్లి మేరబజార్‌కు చెందిన రామగిరి సంపత్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ మేరకు జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు కేఎస్ రామారావు రూ.5 వేలతో పాటు, కళాశాల అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు రూ.62వేలు, ఇతరులు రూ.30 వేలు, మొత్తం రూ.1,02,632ల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

తల్లాడ: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడ మేజర్ పంచాయతీలో యువజన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్ మాట్లాడుతూ.. తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు ముఖ్య కూడలిగా ఉన్న తల్లాడలో ఎలాంటి ట్రాఫిక్ సిగ్నల్స్ గానీ, ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తల్లాడ: సీజనల్ వ్యాధులు, తాగునీరు కలుషితమై వాంతులు, విరోచనాలు సోకే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఐ.రత్నమనోహర్ అన్నారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి కలుషితంతో అతిసార వ్యాధి వచ్చే ప్రమాదముందని, ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని లేదా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ఓ భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చదనం పరిచేందుకు..

నేడు వనమహోత్సవం ప్రారంభం

- డివిజన్‌లో 1.35 లక్షల మొక్కలు సిద్ధం
- కోతుల కోసం పండ్ల మొక్కలు
- శ్రీకారం చుట్టనున్న అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



మొక్కలకు జీవామృతం పోస్తున్న సిబ్బంది

సత్తుపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణలో వృక్షాలే కీలకం.. వీటితో ఆహ్లాదకర వాతావరణంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ముఖ్యంగా అడవుల్లో మొక్కలు నాటి వాటిని పెంచితే భారీ వర్షాలు కురిసి భూగర్భజలాలు పెరిగి వాతావరణ సమతూల్యం ఏర్పడుతుంది. అంతరించిపోతున్న అడవుల స్థానంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం వనమహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యాన సత్తుపల్లి డివిజన్‌లో 1,35,139 మొక్కలు నర్సరీల్లో సిద్ధం చేసింది.

ఇదే అనుకూల సమయం..

వానలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఉంది. గత ప్రభుత్వ హయాంలో 2,678 హెక్టార్లలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటారు. 200 కిలోమీటర్ల పొడవున అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించారు. మొక్కలు విస్తృతంగా నాటడంతో అటవీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో డివిజన్‌లో అడవుల్లో పచ్చదనం పెరిగింది. వన్యప్రాణులైన పులి, ముళ్లపంది, ఎలుగుబంటి, అడవిబర్రెలు, తదితర అరుదైన జంతువులకు ఈ డివిజన్‌లోని అటవీ ప్రాంతం ఆవాసంగా మారింది.

వివిధ జాతుల మొక్కలు సిద్ధం..

ఇప్పటికే అటవీ శాఖ నర్సరీలలో వివిధ జాతుల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో రావి, వేప, వేగిసా, జిట్రేగి, మర్రి, నారవేప, ఉసిరి, సింధుగా, ఏరుమద్ది, చింత, నేరేడు తదితర జాతుల మొక్కలు ఉన్నాయి.

నేడు శ్రీకారం..

సత్తుపల్లి రేంజ్‌లోని గొల్లగూడెం ఫారెస్ట్ బీట్‌లోని 35 హెక్టార్ల అటవీ ప్రాంతంలో 49,900 మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని గొల్లగూడెం బీట్‌లో శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం గొల్లగూడెం బీట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ వి.మంజుల, రేంజర్ స్నేహలత ఆధ్వర్యాన మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో కోతుల ఆహారం కోసం ప్రత్యేకంగా రెండు హెక్టార్లలో పండ్ల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు.

నేడు ముగ్గురు మంత్రులు రాక

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, పక్కన దయానంద్ తదితరులు

సత్తుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం చేపడుతున్న వనమహోత్సవానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రజాకవి జయరాజ్ హాజరవుతారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆమె డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి మాట్లాడారు. బుధవారం ఉదయం 9గంటలకు పెనుబల్లి మండలం లంకపల్లి ప్లాంటేషన్‌లో, 9.30 గంటలకు జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో మొక్కలు నాటాక సభ నిర్వహించడంతో పాటు పట్టణంలో పాత సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. సత్తుపల్లి ప్రాంతంలో సింగరేణి గనులతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా 2.45 లక్షల మొక్కలను నాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్ పాషా, మౌలాలీ, దూదిపాల రాంబాబు, మందపాటి ముత్తారెడ్డి, పద్మజ్యోతిరెడ్డి, నాగుల్‌మీరా, కంటే నాగలక్ష్మి, దొడ్డా శ్రీనివాసరావు, పింగళి సామ్యేలు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటడంతో పాటు సంరక్షిస్తాం..



అటవీశాఖ ఆధ్వర్యాన సత్తుపల్లి, తల్లాడ రేంజ్ పరిధిలోని 1.35 లక్షల మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చర్యలు చేపడతాం, గుంతలు తీసి వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. మొక్కల పెంపకాన్ని ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి.

– వి.మంజుల, ఎఫ్‌డీఓ, సత్తుపల్లి

దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధిద్దాం



కారేపల్లి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



కొణిజర్ల: రామనర్సయ్యనగర్‌లో..

కారేపల్లి: దొడ్డి కొమరయ్య ఆశాయాలను సాధించాలని, ఈ నెల 4న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి రాష్ట్ర సదస్సుకు ప్రజాస్వామికవాదులు హాజరై విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కె శ్రీనివాసరెడ్డి, వై జానకి, అలెం గురవయ్య, చంద్రయ్య, కోటయ్య, నాగేశ్వరరావు, సంపత్, లక్ష్మయ్య, సుగుణ, మంగమ్మ, బుర్ర కొటక్క, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ పిలుపునిచ్చారు. మండలంలోని రామనర్సయ్యనగర్‌లో పార్టీ నాయకులు వర్ధంతి సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల తరుపున పోరాడిన కొమరయ్య అని కొనియాడారు. నాయకులు బాణోత్ కిషన్, బాషా, భూక్యా శంకర్, గుగులోత్ దస్రు, సీతయ్య, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ఘనంగా ‘సీత్లా’ వేడుకలు

కారేపల్లి: మండలంలో మంగళవారం సీత్లా (దాటోడి) పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేకలతండా, వెంకిట్యాతండా, భజ్యాతండా, మధురానగర్‌తండా, బొక్కలతండా గ్రామాల్లో బంజారాలు అత్యంత ఆహ్లాదకరంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వానలు కురవాలని, పశు సంపద వృద్ధి చెందాలని, భక్తి శ్రద్ధలతో.. తమ సంస్కృతి సాంప్రదాయలను పాటిస్తూ వేడుకలు జరుపుకున్నారు. సీత్లా (భవానీ) మాతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



నైవేద్యంతో వస్తున్న బంజార మహిళలు

ఆంజనేయ ఆలయాల్లో అన్నదానాలు



మధిర: భోజనం వడ్డిస్తున్న దాతలు..

మధిర: అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని అభయాంజనేయ స్వామి ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు వెలగపూడి హనుమంతరావు డాలు కృష్ణ అన్నారు. మంగళవారం ఆత్కూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ప్రతీ మంగళవారం దాతలు ఆర్థిక సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని మెట్టాంజనేయస్వామి ఆలయం, అయ్యగారిపేట శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో గడ్డం కిషోర్‌రెడ్డి, మిద్దే శ్రీను, కె.నర్సింహారావు, టి.వెంకటకృష్ణారావు, రమేష్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లూరు అంకమరాజు, కాల్నేని కాంతారావు, చెన్నయ్య, బి.వెంకటేశ్వరరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, కొప్పుల రజిని, రాజ్యం పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

- విరిగిన విద్యుత్ స్తంభం

ముదిగొండ: మండలంలోని పెద్దమండవలో మంగళవారం ట్రాక్టర్ వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టండంతో స్తంభం విరిగింది. జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎదుట ఉన్న మలుపులో విద్యుత్ స్తంభం విరిగి ట్రాక్టర్ ట్రక్కుకు ఆనుకుని ఉండడంతో విద్యుత్ వైర్లు నేలవాలలేదు. సంఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా మున్నేరులో ఇసుక కోసం వెళ్లే ట్రాక్టర్‌లు, ఇసుక నింపుకుని వచ్చే ట్రాక్టర్‌లు అతి వేగంగా ట్రాక్టర్‌లు నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం

రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలు

- విస్తృతంగా రైతు భరోసా సభలు

సత్తుపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మండలంలోని కొత్తూరు, తుంబూరు, గంగారం గ్రామాలలో రైతు భరోసా అభిప్రాయ సేకరణ గ్రామసభలు నిర్వహించారు. గంగారం సభలో ఆమె మాట్లాడుతూ ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిపుణులతో ఆలోచన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటీవ్ సబ్‌రిజిస్ట్రార్ పటియ నాయక్, సహాయ సహకార అధికారి రవికుమార్, వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు, ఏఈఓలు ఆశాజ్యోతి, వాసంతి, చల్లగుండ్ల కృష్ణయ్య, మందపాటి వెంకటరెడ్డి, చిలుకూర్తి కృష్ణమూర్తి, చల్లగుళ్ల నర్సింహారావు, దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన), తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయం పండగలా మారాలి..

మధిరరూరల్: మండలంలోని ఖమ్మంపాడు రైతు వేదికలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం పండుగలా మారాలంటే అన్నదాతలను ప్రోత్సహించాలని మండల కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ అన్నారు. డీసీసీబీ దొండపాటి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సామినేని సురేష్, రైతులు పాల్గొన్నారు.

సాగుచేసే రైతులకే అందించాలి..

వేంసూరు: పంటలను సాగు చేసే రైతులకే రైతు భరోసా అందించాలని, వెంచర్లకు, ఇళ్ల స్థలాలకు, కొండలకు గుట్టలకు గతంలో రైతుబంధం వచ్చిందని, ప్రస్తుతం వాటికి రైతు భరోసా తీసి వేయాలని పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లచ్చన్నగూడెం, కందుకూరు, భరణిపాడు సొసైటీల్లో రైతుభరోసా అమలుపై రైతు అభిప్రాయ సేకరణకు మహాజన సభలు నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకుని ప్రతీ రోజు ఆన్‌లైన్ చేస్తునట్లు సత్తుపల్లి ఏడీఏ యూ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ ఉషారాణి, ఆడిటర్ ఇందుమతి, ఏఓ రాంమోహన్, డీసీసీబీ డైరక్టర్ గొర్ల సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్ గంగ్ర సోమిరెడ్డి, భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, కృష్ణరెడ్డి, పుచ్చాకాయల సోమిరెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి, ప్రసాద్, రవి, రాంబాబు, చెన్నారావు పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతులకే భరోసా అందించాలి

ఎర్రుపాలెం: ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేయాలని ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఎర్రుపాలెం, అయ్యవారిగూడెం, రాజుపాలెం గ్రామాల్లోని రైతువేదికల్లో నిర్వహించిన రైతు మహాజన సమావేశాల్లో రైతు భరోసా పథకం వర్తింపు చేయాల్సిన తీరు తెన్నులపై పలు రకాల సూచనలు చేశారు. విధి, విధానాల రూపకల్పన కోసమే ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు కో ఆపరేటివ్ సొసైటీల డిప్యూటీ రిజిస్ట్రార్ నాయక్ తెలిపారు. సొసైటీ చైర్మన్లు ముల్పూరి శ్రీనివాసరావు, అనుమోలు సాంబశివరావు, వెన్నపూస కృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, సీఈఓలు రామిశెట్టి ఏసుబాబు, మోహన్‌రావు, బొగ్గుల శివారెడ్డి, ఏఈఓలు ధాత్రి, శ్రీకాంత్, జిష్ణు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: రైతు భరోసా సభలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు



మధిరరూరల్: మాట్లాడుతున్న వంశీకృష్ణ



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు

మున్సిపాలిటీలో పనులకు నిధుల కేటాయింపు

- సాధారణ, అత్యవసర పనులకు రూ.5.02 లక్షలు
- కార్మికుల వేతనం పెంపు, పలు తీర్మానాలకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ సూతకాని జైపాల్

వైరా: వైరా మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ తీర్మానాలకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన సమావేశం జరగగా, వివిధ పనులకు నిధులు కేటాయిస్తూ తీర్మానించారు. ఈ మేరకు సాధారణ, అత్యవసర పనులకు రూ 5,02,975, శానిటేషన్ నిర్వహణ, బ్లీచింగ్, సున్నం కొనుగోలుకు రూ.5లక్షలు, చేతి పంపుల మరమ్మతులు, తాగునీటి పైపుల లీకేజీ మరమ్మతులకు రూ.10 లక్షలు, 20వ వార్డులో తాగునీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణానికి రూ.35 లక్షలు, స్పెషల్ డ్రైవ్‌లో నాలుగు నెలల పాటు 50 మంది కార్మికుల వేతనాలకు రూ.12.27లక్షలు, ఫాగింగ్ మిషన్, యాంటీ లార్వా మిషన్ల మరమ్మతులు, ఆయిల్‌బాళ్ల తయారీకి రూ.2.50లక్షలు, నాలుగో వార్డులో గ్రావెల్ తోలకాలకు రూ.1.82లక్షలు, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.2.లక్షలు, హరితహారం మొక్కల పెంపకానికి రూ.35 లక్షలు కేటాయిస్తూ తీర్మానాలకు ఆమోదించారు. అలాగే, వాహనాల మరమ్మతుకు రూ.10 లక్షలు, వీధి కుక్కల నిర్మూలను రూ.5.లక్షలు, పిచ్చి మొక్కల తొలగింపునకు రూ.2లక్షలు, మున్సిపల్ చైర్మన్‌కు 2020 నుంచి 2025 వరకు వాహనం అద్దెగా రూ.19.80లక్షలు, విద్యుత్ దీపాలు నిర్వహణకు రూ.3.96లక్షలు కేటాయించారు. ఇంకా జేసీబీలు, ట్యాంకర్‌లు, ట్రాక్టర్ల అద్దె, ఆర్‌సీసీ పైపులు కొనుగోలు, ఒకటో వార్డులో శ్మశాన వాటిక మరమ్మతులు, రెండోవార్డు శ్మశానవాటికలో వసతుల కల్పన, ఇతర పనులను సైతం ఆమోదించారు. అలాగే, పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ.8,500 నుంచి రూ.11,500కు పెంచుతూ తీర్మానించారు. కాగా, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ 20వార్డుల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున రూ.2.కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా చైర్మన్ జైపాల్, కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమిషనర్ చింతా వేణు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి



మధిర: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



చింతకాని: ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు

మధిర: నిరుద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల అభ్యర్థులకు జీవో నెంబర్ 46 వల్ల అన్యాయం జరుగుతుందని, దీనిని రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీహరి, బాడిశ అర్జున్ రావు, పగడాల నాగేంద్రబాబు, సాయిరాం పాల్గొన్నారు.

చింతకాని: నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు కొండా గోపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–1, 2 పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగాచారి, సురేష్, గోపి, మంగయ్య, విఘ్నేష్, హరి, హేమంత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న భోజన కార్మికులు

మధిర: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం మధిర మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న అన్ని పాఠశాలల్లో వంట బంద్ చేసి నిరసన తెలపనున్నామన్నారు. కార్మికులు తిరుపతమ్మ, ధనలక్ష్మి, రమాదేవి, కనకదుర్గ, కృష్ణకుమారి, చెన్నమ్మ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎ.శరత్ మాట్లాడుతూ... నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంత్, కల్యాణ, రవి, శ్రీను, కుమారి, లక్ష్మి, వెంకటరమణ, రాజేశ్వరీ, కృష్ణవేణి, ఖాసీంబి పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు